Crime Mirror QR Code

https://epaper.crimemirror.com/

క్రైమ్ మిర్రర్ ®

Voice of Anti Corruption

హైదరాబాద్

14-10-2024

వెల: రూ.5/-

పేజీలు: 10+10

సంపుటి:13

సంచిక: 341

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

# జాతీయ రహదారిపై వాహనాల వరద

**టోల్ ప్లాజాల వద్ద భారీగా బారులు.. పంతంగి, కేతేపల్లి వద్ద కిక్కిరిసిన వాహనాలు**

**హైదరాబాద్‌కు జనం తిరుగుపయనం.. దసరా పండుగ ముగియడంతో నగరానికి**



దసరా పండుగను రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు అత్యంత వైభవంగా జరుపుకొన్నారు. శనివారం ఊరూరా అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. శమీ పూజలతోపాటు బొడ్రాయి, గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు చేసి జమ్మిచెట్టును దర్శించుకున్నారు. జమ్మి ఆకును సేకరించి ఒకరికొకరు పంచుకొని అలయ్ బలయ్ తీసుకున్నారు. పాలపిట్టను తిలకించి పరవశించిపోయారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా రావణ వధ కార్యక్రమం నిర్వహించారు. కాగా, దసరా పండుగ నేపథ్యంలో వరుస సెలవులు రావడంతో హైదరాబాద్ నుంచి ఏపీ రాష్ట్రంతోపాటు తెలంగాణలోని వివిధ ప్రాంతాలకు వెళ్లి తిరిగి పయనమైన వాహనాలతో ఆదివారం రహదారులు కిక్కిరిసిపోయాయి. వివిధ టోల్ ప్లాజాల వద్ద వందల సంఖ్యలో వాహనాలు బారులు తీరాయి. పలుటోట్ల అదనపు కౌంటర్ల ద్వారా పంపించినా.. వాహనాల రద్దీ మరీ ఎక్కువగా ఉండడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. 65వ నెంబర్ జాతీయ రహదారిపై ఉదయం నుంచే వాహనాల రాకపోకలు పెరిగాయి. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలో, నల్లగొండ జిల్లా కేతేపల్లి టోల్‌గేట్ వద్ద

(మిగతా 2వ పేజీలో)



# సొంతూరిలో సీఎం దసరా సంబరాలు

**సీఎం హెూదాలో తొలిసారిగా**

**కొండారెడ్డిపల్లికి వచ్చిన రేవంత్‌రెడ్డి**

కొడంగల్: సీఎం రేవంత్‌రెడ్డి దసరా పండుగ సందర్భంగా శనివారం సొంత గ్రామమైన కొండారెడ్డిపల్లిలో పర్యటించారు. ముఖ్య మంత్రి హెూదాలో తొలిసారి స్వగ్రామానికి వచ్చిన రేవంత్‌రెడ్డికి అడుగడుగునా పూలు, డప్పు వాయిద్యాలు, బతుకమ్మలు, కోలాటాలతో గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. కుటుంబ సభ్యులు, గ్రామస్తుల నడుమ దసరా వేడుకలు జరుపుకొన్న సీఎం రేవత్‌రెడ్డి అందరినీ పలకరిస్తూ గ్రామస్తుల్లో పండుగ సంబురాన్ని రెట్టింపు చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం కొండారెడ్డిపల్లికి శనివారం మధ్యాహ్నం 3 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి హెలీకాప్టర్‌లో చేరుకున్నారు. కొండారెడ్డిపల్లి పంచాయతీ కార్యాలయం పలు అభివృద్ధి కార్యక్రమాలకు సీఎం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ మల్లు రవి, కలెక్టర్ సంతోష్, ఎమ్మెల్యేలు చిక్కుడు వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణరెడ్డి, కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి, జి.మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కొండారెడ్డిపల్లిలో సీఎం రేవంత్‌రెడ్డి తన ఇంటి నుంచి

(మిగతా 2వ పేజీలో)

# నేటి నుంచి పల్లె పండుగ

- 20 వరకూ పంచాయతీ వారోత్సవాల నిర్వహణ
- 3 వేల కి.మీ. సిమెంట్ రోడ్ల నిర్మాణాలకు భూమిపూజ
- కంకిపాడులో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ శ్రీకారం
- టూర్ షెడ్యూల్ ప్రకటించిన మంత్రులు, ఎమ్మెల్యేలు
- సంక్రాంతి నాటికి రోడ్లు పూర్తయ్యేలా ప్రణాళికలు
- అందుబాటులో ఉన్న ఉపాధి నిధులతో బిల్లుల చెల్లింపు
- పనులు చేపట్టేందుకు ముందుకు వస్తున్న కాంట్రాక్టర్లు



అమరావతి : రాష్ట్రంలో అభివృద్ధి పనులకు కూటమి సర్కారు శ్రీకారం చుట్టింది. ఐదేళ్ల పాటు వైసీపీ విధ్వంస పాలన కొనసాగిన తర్వాత మొట్టమొదటసారిగా చేపట్టనున్న 'పల్లె పండుగ-పంచాయతీ వారోత్సవాల'కు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా సిమెంట్ రోడ్ల నిర్మాణాలకు 14న సోమవారం భూమి పూజ చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. అన్నీ జిల్లాల్లో కలెక్టర్లు గ్రామసభల్లో ఆమోదించిన 30 వేల పనులకు సంబంధించి 3 వేల కి.మీ మేర సిమెంట్ రోడ్లకు ఇప్పటికే పరిపాలన అనుమతి మంజూరు చేశారు. సాంకేతిక ఆమోదం కోసం

(మిగతా 2వ పేజీలో)

# రక్తమోడిన దేవరగట్టు



**కర్రల సమరంలో 95 మందికి గాయాలు**

**20 మంది పరిస్థితి విషమం**

హెూళగుంద: మాళ మల్లేశ్వరస్వామి దసరా బన్ని ఉత్సవాల్లో ఈ ఏడాది కూడా రక్తం చిమ్మింది. కర్నూలు జిల్లా హెూళగుంద మండలం దేవరగట్టులో విజయదశమి సందర్భంగా శనివారం అర్ధరాత్రి తర్వాత మొదలైన బన్ని ఉత్సవంలో సంప్రదాయ ఆచారమే గెలిచింది. స్వామివారి కల్యాణోత్సవం అనంతరం విజయోత్సవంలో భాగంగా ఉత్కంఠ భరితంగా జరిగిన జైత్రయాత్ర (కర్రల సమరం)లో 95 మందికి గాయాలు కాగా.. మరో 10 మందికి తీవ్ర గాయాలయ్యాయి. తలలు పగిలి, దివిటీలు తగిలి, కిందపడి చేతులు విరిగి.. ఇతర గాయాలతో పరిస్థితి విషమంగా ఉన్న వారికి స్థానిక హెల్త్ క్యాంప్‌లో



**డీయూ మాజీ ప్రొఫెసర్**

# సాయిబాబా కన్నుమూత

ఢిల్లీ: ఢిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్, ఉద్యమకారుడు, రచయిత, విద్యావేత్త జీ.ఎన్ సాయిబాబా కన్నుమూశారు. నిమ్స్‌లో చికిత్స పొందుతూ శనివారం తుది శ్వాస విడిచారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. నక్సల్స్‌తో సంబంధాలున్నాయనే ఆరోపణలతో గతంలో సాయిబాబాను అరెస్టు చేశారు. దాదాపు 9 ఏళ్లపాటు ఆయన జైల్లోనే గడపాల్సి వచ్చింది. మావోయిస్టులతో సంబంధాలున్నాయనే అభియోగాలపై 2014లో మహారాష్ట్ర పోలీసులు సాయిబాబాను అరెస్ట్ చేశారు. సాయిబాబా కేసును ఎన్ఐఏ దర్యాప్తు చేసింది. 2017లో గడ్చిరోలి కోర్టు నిందితులకు జీవితఖైదు విధించగా.. ఆయన నాగ్‌పూర్ జైల్‌లో శిక్ష అనుభవించారు. అనంతరం

(మిగతా 2వ పేజీలో)

**చీఫ్‌విప్‌గా 'పట్నం' నియామకం**

# రాజ్యాంగ విరుద్ధం

**మండలి చైర్మన్ బీఆర్ఎస్ ఎమ్మెల్సీని ప్రభుత్వ చీఫ్‌విప్‌గా ఎలా నియమిస్తారు**

**మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజం**





**మహారాష్ట్ర మాజీ మంత్రి**

# బాబా సిద్ధిఖీ హత్య

- ముంబైలో కాల్చి చంపిన ముగ్గురు వ్యక్తులు..
- కుమారుడి కార్యాలయం వద్ద ఉండగా ఘటన
- తమ పనేనన్న లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్

# వరద నిర్వహణలో స్టార్టప్‌లది కీలక పాత్ర

**వాటి సహకారంతోనే వేగంగా సహాయం: మంత్రి లోకేశ్**





**రానున్నది**

# గ్రీన్ పవర్ యుగం

**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

**20 వేల మెగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి లక్ష్యంగా ప్రణాళికలు**

**మంత్రులు పొంగులేటి, తుమ్మలతో కలసి బయోమాస్ పవర్ ప్లాంట్ ప్రారంభం**

అశ్వారావుపేట: ప్రపంచంలో రానున్నది గ్రీన్ పవర్ యుగమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీలో రూ.36.50 కోట్లతో నిర్మించిన 2.5 కేవీ బయోమాస్ పవర్‌ప్లాంట్‌ను మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులతో కలసి శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బొగ్గు, వంట చెరుకును మండించకుండా జలవిద్యుత్, పవన విద్యుత్‌తోపాటు గ్రీన్ పవర్ యుగం రాబోతోందని చెప్పారు. కాలుష్యం లేకుండా ప్రకృతిలోని వనరుల సహకారంతో విద్యుత్ ఉత్పత్తి అవుతుందని, ఇందుకోసం రాష్ట్రంలో కొన్ని గ్రామాలను ఎంపిక చేసి పైలట్ ప్రాజెక్టుల కింద సోలార్ విద్యుత్ ప్లాంట్‌లు ఏర్పాటు చేస్తామని భట్టి తెలిపారు. పైలట్ ప్రాజెక్టు పరిధిలోని రైతులకు సోలార్ పంపుసెట్లు ఏర్పాటు చేస్తామని, రాబోయే ఆరేళ్లలో 20 వేల మెగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి సామర్థ్యం లక్ష్యంగా

మిగతా 2వ పేజీలో)




# సొంతూరిలో సీఎం దసరా సంబరాలు

గ్రామంలోని మైసమ్మ ఆలయ ప్రాంగణంలో ఉన్న జమ్మి చెట్టు వద్దకు గ్రామస్తులతో కలిసి కాలినడకన బయలుదేరారు. మార్గమధ్యలో గ్రామస్తులను పేరుపేరునా పలకరిస్తూ.. ఆప్యాయంగా ముచ్చటిస్తూ జమ్మిచెట్టు వద్దకు చేరుకొని శమీ పూజలు నిర్వహించారు. అనంతరం ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు, అభిమానులు సీఎంతో సెల్ఫీలు, ఫొటోల కోసం పోటీ పడటంతో సుమారు 40 నిమిషాలపాటు వారితో ఫొటోలు దిగుతూ గ్రామస్తులను ఆనందంలో ముంచెత్తారు. పాలమూరు బిడ్డగా ఉమ్మడి జిల్లాను అభివృద్ధి పథంలో నడిపే బాధ్యత తనదని, ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతానని చెప్పారు. విద్య, వైద్యం, సాగునీరు, ఉపాధి కల్పనకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, వేగంగా నిర్ణయం తీసుకునేందుకు తాను సిద్ధంగా ఉన్నట్టు ఎమ్మెల్యేలు, అధికారులకు చెప్పారు. మరోసారి గ్రామానికి వచ్చి అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తానన్నారు. రాత్రి 8.30 గంటలకు రోడ్డు మార్గంలో కొడంగల్‌కు బయలుదేరారు. కొడంగల్‌లో సీఎం రేవంత్‌రెడ్డికి కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ నారాయణరెడ్డి, అడిషనల్ కలెక్టర్లు లింగ్యానాయక్, స్యుదీర్, సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమా హారతి స్వాగతం పలికారు. పూల మొక్కలు ఇచ్చి దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం ఉదయం నియోజకవర్గంలోని ముఖ్య నాయకులు, కార్యకర్తలు సీఎంను కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు మహ్మద్ యూసూఫ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్, యువజన కాంగ్రెస్ జాతీయ కోఆర్డినేటర్ కృష్ణంరాజు తదితరులు సీఎంను కలిశారు. పరిగి, తాండూరు ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి కొడంగల్‌కు వచ్చి ముఖ్యమంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

# జాతీయ రహదారిపై వాహనాల వరద

వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. పంతంగి టోల్‌గేటు వద్ద 16 గేట్లకుగాను 10 గేట్ల ద్వారా హైదరాబాద్ వైపు వాహనాలను పంపించారు. సాధారణ రోజుల్లో 30 నుంచి 35వేల వాహనాలు రాకపోకలు సాగిస్తుండంగా దసరా పండుగ నేపథ్యంలో 50వేలకు పైగా వాహనాలు రాకపోకలు సాగించినట్లు టోల్‌గేట్ నిర్వాహకులు తెలిపారు.

**గూడూరు వద్ద కిలోమీటరుపైగా..**

బీబీనగర్ మండలం గూడూరు టోల్‌ప్లాజా వద్ద కిలోమీటరు పైగా వాహనాలు బారులు తీరాయి. కేతేపల్లి మండలంలోని కొర్లపహాడ్ శివారులో ఉన్న టోల్‌ప్లాజా వద్ద వాహనాల సంఖ్యకు అనుగుణంగా అదనపు కౌంటర్లు ఏర్పాటు చేయకపోవడంతో వాహనాలు అర కిలోమీటర్ మేర నాలుగు లేన్లతో బారులు తీరాయి. ఆదివారం 35 వేల నుంచి 40 వేల వాహనాలు రాకపోకలు సాగించాయని సిబ్బంది తెలిపారు. నార్కట్‌పల్లి-అద్దంకి రాష్ట్ర రహదారిపై ఆదివారం రాత్రి 7 గంటల సమయంలో భారీగా ట్రాఫిక్ జామ్ కావడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని రేణికుంట గ్రామం వద్ద రాజీవ్ రాహదారిపై ఉన్న టోల్‌గేట్ వద్ద ఆదివారం కిలోమేటర్ మేర వాహనాలు నిలిచిపోయాయి. సిద్దిపేట జిల్లా కొండపాక మండలం దుద్దెడ టోల్ ప్లాజా వద్ద ఆదివారం సాయంత్రం సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో వాహనాలు నిలిచిపోయాయి. హైదరాబాద్ నగరంలో నిత్యం ట్రాఫిక్ రద్దీతో నరకప్రాయంగా ఉండే రోడ్లన్నీ గత రెండు రోజులుగా వెలవెలబోయాయి. పట్నం, పల్లెకు వెళ్లడంతో హ్యాంగవుట్ స్పాట్స్ సహా అన్నీ కళతప్పాయి. శనివారమంతా పండుగ సంబరంతో అలిసిన నగర జనం, ఆదివారం ఆ అలసట తీర్చుకోవడానికి ఎక్కువగా ఇళ్లకే పరిమితమయ్యారు. వరుస సెలవులతో ఏపీ, తెలంగాణకు పెద్ద సంఖ్యలో నగరవాసులు తరలివెళ్లడంతో వారాంతంలో కూడా హొటళ్లు, రెస్టారెంట్లలో ఆక్యుపెన్సీ కూడా తగ్గింది. ఈ మధ్యకాలంలో నగరంలో ఇంత తక్కువ ట్రాఫిక్ రద్దీని తాము చూడలేదని ట్రాఫిక్ పోలీసులు చెబుతున్నారు. అయితే, తెలంగాణ జిల్లాల నుంచి సాయంత్రం బయలు దేరిన నగరవాసులు అర్ధరాత్రి తరువాత ఇంటికి చేరుకోవడం కనిపించింది.

# వరద నిర్వహణలో స్టార్టప్‌లది కీలక పాత్ర

(మొదటి పేజీ తరువాయి)

అమరావతి, అక్టోబరు 13 : ఇటీవల వరదలు రాష్ట్రంపై తీవ్ర ప్రభావమే చూపాయి. ఆ సమయంలో వరద నిర్వహణ, త్వరితగతిన సాయం అందిం చేందుకు స్టార్టప్‌లు ఎంతగానో ఉపయోగపడ్డాయని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. ‘స్టార్టప్ ఆంధ్ర అనేది నినాదం కాదు.. పరిపాలనా విధానాన్ని మార్చేసే ప్రక్రియ..’ అని ఆయ న ఎక్స్‌లో ట్వీట్ చేశారు. వరద సహాయక చర్యల్లో స్టార్టప్‌లు, డీప్-టెక్ సాంకేతికతను ఏ విధంగా వినియోగించుకున్నామో వివరిస్తూ ఆదివారం ఆయన ‘ఎక్స్’లో ఓ కథనాన్ని పోస్ట్ చేశారు. ఇటీవల వరదలతో ఇబ్బంది పడుతున్నప్పుడు రియల్ టైమ్‌లో సమస్యలు పరిష్కారానికి మార్గాలు అందించే స్టార్టప్‌లను ఆహ్వానించామని చెప్పారు. ఈ క్రమంలో సమస్యలను రికార్డు సమయంలోనే పరిష్కరించే స్టార్టప్‌ల సామర్థ్యాన్ని చూసి తామే ఆశ్చర్యపోయామని మంత్రి తెలిపారు.

# రానున్నది గ్రీన్ పవర్ యుగం

(మొదటి పేజీ తరువాయి)

ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వివరించారు. ఇందిరమ్మ రాజ్యంలో రైతులకు ప్రాధాన్యం కల్పిస్తూ రూ.73 వేల కోట్లను వ్యవసాయ రంగానికి కేటాయించామని చెప్పారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ గతంలో పామాయిల్ ఫ్యాక్టరీని అమ్మేందుకు కుట్ర జరిగిందని, ఆ చర్యలను తిప్పికొట్టి రాష్ట్రవ్యాప్తంగా ఆయిల్‌పామ్ సాగు విస్తరించామని తెలిపారు. పామాయిల్ గెలల ధర పెంచేందుకు ఇప్పటికే కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చామని, టన్నుకు రూ.20 వేలకు పైగా రైతులకు అందించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. ప్రభుత్వ ప్రత్యేక చొరవతో దేశంలోనే ఆయిల్‌పామ్ రంగంలో తెలంగాణ అగ్రగామిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గిరిజన ప్రాంతమైన అశ్వారావుపేట పామాయిల్ తోటలతో పచ్చగా మారడం హర్షణీయమని అన్నారు. రాష్ట్రంలోని రైతులు లాభసాటి పంటలపై దృష్టి సారించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

# మహారాష్ట్ర మాజీ మంత్రి బాబా సిద్ధిఖీ హత్య

## ముంబైలో కాల్చి చంపిన ముగ్గురు వ్యక్తులు..
## కుమారుడి కార్యాలయం వద్ద ఉండగా ఘటన
## తమ పనేనన్న లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్



ముంబై, అక్టోబరు 13: మాజీ మంత్రి, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (అజిత్ పవార్)కి చెందిన నాయకుడు బాబా సిద్ధిఖీ హత్యకు గురయ్యారు. ముంబైలో ఆయనను ముగ్గురు వ్యక్తులు కాల్చి చంపారు. బాబా శనివారం రాత్రి బాంద్రాలోని తన కుమారుడు, వాంద్రే ఎమ్మెల్యే అయిన జీషన్ సిద్ధిఖీ కార్యాలయం వద్ద ఉండగా ఈ ఘటన చోటుచేసుకుంది. కాల్పుల అనంతరం ఆయనను లీలావతి ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. బాంద్రా పశ్చిమ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన బాబా సిద్ధిఖీ (66) మంత్రిగా పనిచేశారు. గత రెండు ఎన్నికల్లో పరాజయం పాలయ్యారు. ఈ సంవత్సరం ఎన్సీపీలో చేరారు. ముంబైలో ముస్లిం నాయకుడిగా బాగా పలుకుబడి కలిగిన సిద్ధిఖీ.. బాలీవుడ్ స్టార్ కథానాయకుడు సల్మాన్‌ఖాన్‌కు అత్యంత సన్నిహితులు. ఓ దశలో తీవ్ర విభేదాలతో కనీసం పలకరింపులు లేని సల్మాన్-షారూక్ ఖాన్ మధ్య సయోధ్య కుదిర్చింది సిద్ధిఖీనే. సంజయ్ దత్ సహా పలువురు నటీ నటులతోనూ ఆయకు దగ్గరి సంబంధాలున్నాయి. ఈయన ఇచ్చే భారీ ఇఫ్తార్ విందులకు బాలీవుడ్ నటులు పెద్దఎత్తున తరలివచ్చేవారు. కాగా, సిద్ధిఖీపై కాల్పులకు పాల్పడిన ముగ్గురిలో ఇద్దరిని పట్టుకున్నామని, మరొకరు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుల్లో గుర్మైల్(23) హరియాణాకు చెందినవాడు. మిగతా ఇద్దరు యూపీ వాసులైన ధర్మరాజ్(19), శివకుమార్. శివకుమార్ పరారీలో ఉన్నాడు. హత్యకు కుట్రదారులుగా, నిందితులకు సాయపడినవారిగా భావిస్తున్నవారిలో ప్రవీణ్ అనే వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. అక్తర్ కోసం గాలిస్తున్నారు. అయితే, ధర్మరాజ్ వయసు ఆధార్ ప్రకారం 21గా ఉన్నప్పటికీ.. అతడు మైనర్ (17)నని పేర్కొనడంతో వయసు నిర్ధారణ పరీక్షలకు కోర్టు ఆదేశించింది. మరోవైపు సిద్ధిఖీ హత్యకు కొన్ని నెలలుగా నిందితులు ప్రణాళికలు రచించారని, ముంబై, పుణెలలో నివాసం ఉన్నారని, సిద్ధిఖీ ఇల్లు, కార్యాలయంపై నిఘా పెట్టారని పోలీసులు తెలిపారు. హత్యకు గాను రూ.50 వేల అడ్వాన్స్ తీసుకున్నారని, ఆయుధాలను బిష్ణోయ్ గ్యాంగ్ సరఫరా చేసిందని పేర్కొన్నారు. సిద్ధిఖీ హత్య తమ పనే అని లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ ప్రకటించింది. ఈ మేరకు గ్యాంగ్ సభ్యుడొకరు ఫేస్ బుక్‌లో పోస్ట్ పెట్టాడు. సల్మాన్‌తో పాటు దావూద్ ఇబ్రహీంతో సంబంధాలున్నందుకే అతడిని హతమార్చినట్లు పేర్కొంది. సిద్ధిఖీ హత్యతో సల్మాన్ ఇంటి వద్ద భద్రతను పెంచారు. సల్మాన్ ఆదివారం సాయంత్రం సిద్ధిఖీ ఇంటికెళ్లి భౌతిక ఖాయానికి నివాళి అర్పించారు. ఆ సమయంలో ఆయన తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. శనివారం సల్మాన్ బిగ్ బాస్ షూటింగ్ రద్దుచేసుకుని ఆస్పత్రిలో సిద్ధిఖీ మృతదేహాన్ని సందర్శించారు.

# నేటి నుంచి పల్లె పండుగ



ఇంజనీర్లు అంచనాలు రూపొందిస్తున్నారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పెనమలూరు నియోజకవర్గం కంకిపాడులో జరిగే భూమిపూజలో పాల్గొంటారు. అదే విధంగా మంత్రులు, ఎమ్మెల్యేలు ఇప్పటికే షెడ్యూల్ ప్రకటించారు. సిమెంట్ రోడ్ల నిర్మాణాలకు పంచాయతీరాజ్‌శాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. సిమెంట్ కొనుగోలుకు సంబంధించి ఒక్కో బస్తా రూ.270 చొప్పున స్థానిక మార్కెట్లలో కొనుగోలు చేసి వాడుకోవాలని ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. రోడ్డు నిర్మాణానికి అవసరమైన ఇసుకను ప్రభుత్వం ఆమోదించిన క్వారీల నుంచి సేకరించాలని పేర్కొంది. ప్రతి రోడ్డు పని వద్ద వర్క్‌సైట్ బోర్డు ఏర్పాటు చేయాలని, దానిపై ఆయా పనులకు సంబంధించిన పూర్తి వివరాలు ఉండాలని సూచించింది. అన్ని పనులకు సంబంధించి పౌరసమాచార బోర్డు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నాణ్యతతో కూడిన సిమెంట్ రోడ్లను జనవరి లోపు పూర్తి చేయాలని, వీటిని క్వాలిటీ కంట్రోల్, సోషల్ ఆడిట్ విభాగం తనిఖీ చేస్తుందని మార్గదర్శకాల్లో తెలిపింది. రానున్న సంక్రాంతి నాటికి సిమెంట్ రోడ్లును ప్రారంభించేందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు ప్రణాళికలు రూపొందించారు.

**భూమి పూజల్లో ఎమ్మెల్యేలు**

రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో సిమెంట్ రోడ్ల భూమి పూజకు ఎమ్మెల్యేలు టూర్ షెడ్యూల్ విడుదల చేశారు. ఈ నెల 14 నుంచి 20 వరకు వారంతా ఆయా ప్రాంతాల్లో చేపట్ట నున్న భూమి పూజల్లో నిమగ్నమవుతారు. సీఎం చంద్రబాబు కూడా ఎక్కడో ఒకచోట ఈ కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం ఉంది. అయితే ఇంకా షెడ్యూలు ఖరారు కాలేదు. ఐదేళ్ల తర్వాత చేపట్టనున్న సిమెంట్ రోడ్ల భూమిపూజను ఒక పండుగలా ప్రారంభించాలని సర్కారు యోచి స్తోంది. ఉపాధి నిధులు అందుబాటులో ఉండటంతో బిల్లు చెల్లింపులకు ఢోకాలేదని తెలియడంతో పనులు చేపట్టేందుకు గ్రామాల్లో కాంట్రాక్టర్లు ముందుకొస్తున్నారని అధికారులు చెబుతున్నారు.

**మెటీరియల్ నిధుల సద్వినియోగం దిశగా**

ఉపాధి హామీ పథకంలో మెటీరియల్ నిధుల సద్వినియోగం ఐదేళ్ల తర్వాత ప్రారంభమవుతోంది. ఈ ఏడాదిలో రూ.3వేల కోట్ల నిధులతో 3 వేల కి.మీ. సిమెంట్ రోడ్లు , 500 కి.మీ. తారు రోడ్ల నిర్మాణం, 22 వేల మినీ గోకులాలతో పాటు పలు వ్యక్తిగత ఆస్తులను పేదలకు కల్పించనున్నారు. గత టీడీపీ ప్రభుత్వ పాలనలో ఉపాధి పథకం మెటీరియల్ నిధులు విస్తృతంగా వినియోగించుకొనేవారు. వైసీపీ సర్కారు వచ్చిన తర్వాత ఉపాధి పథకం స్ఫూర్తిని దెబ్బతీయడంతో పాటు మెటీరియల్ నిధులు వాడుకోవడంలో విఫలమైంది. గత చంద్రబాబు ప్రభుత్వం సిమెంట్ రోడ్లు, డ్రెయిన్లతో పాటు పలు సాగు, తాగునీటి వనరుల కల్పనకు ఈ నిధులను వాడి సద్వినియోగం చేసుకుంది. అయితే వైసీపీ హయాంలో మొదటి ఏడాది సరైన ప్రణాళికలు లేక నిధులు వృథా అయ్యాయి. ఆ తర్వాత జగనన్న కాలనీల లెవలింగ్ పనులంటూ కొండల్లో, చెరువుల్లో మట్టి పోసి వైసీపీ కార్యకర్తలకు అప్పనంగా నిధులు దోచిపెట్టారు. అలాగే సచివాలయ భవనాల నిర్మాణాలు ప్రారంభించి అసంపూర్తిగా వదిలేశారు. దీంతో రూ.వేల కోట్ల ఉపాధి నిధులను దుర్వినియోగమయ్యాయి.

# చీఫ్‌విప్‌గా ‘పట్నం’ నియామకం రాజ్యాంగ విరుద్ధం

## మండలి చైర్మన్ బీఆర్ఎస్ ఎమ్మెల్సీని ప్రభుత్వ చీఫ్‌విప్‌గా ఎలా నియమిస్తారు
## మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజం

హైదరాబాద్: శాసనమండలిలో ప్రభుత్వ చీఫ్‌విప్‌గా పట్నం మహేందర్‌రెడ్డి నియామకం రాజ్యాంగ విరుద్ధమని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. మహేందర్‌రెడ్డి అనర్హత పిటిషన్ పెండింగ్‌లో ఉండగా, ఆయనను చీఫ్ విప్‌గా మండలి చైర్మన్ ఎలా గుర్తిస్తారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగాన్ని ఖూనీ చేస్తోందనడానికి ఈ నియామకం ఓ ఉదాహరణ అని అన్నారు. ఆదివారం ఆయన మీడియాతో చిట్‌చాట్ చేస్తూ, నిబంధనలకు విరుద్ధంగా మహేందర్‌రెడ్డిని చీఫ్‌విప్‌గా నియమించారని ధ్వజమెత్తారు. సభలో బిల్లులు పాస్ చేయించడం, ప్రభు త్వ బిజినెస్ జరిగేలా చూడడం చీఫ్‌విప్ బాధ్యత అని అన్నారు. ‘బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికైన మహేందర్‌రెడ్డి ఎవరికి విప్ జారీ చేస్తారు? అధికార పార్టీ సభ్యులకా.. ప్రతి పక్ష పార్టీ సభ్యులకా?’అని ప్రశ్నించారు. శాసనసభ సమావేశాలు ముగిసే నాటికి బీఆర్ఎస్ పార్టీ సభ్యుల సంఖ్య 38 అని స్పీకర్ చెప్పారని, ఈ విషయాన్ని కాంగ్రెస్ వారు కూడా చెప్పారని గుర్తు చేశారు. అయితే మార్చి 15వ తేదీన మహేందర్‌రెడ్డిని చీఫ్‌విప్‌గా నియమిస్తూ గెజిట్ విడుదల చేశారని, మార్చిలో చీఫ్‌విప్ అయితే పంద్రాగస్టు, జూన్ 2, సెప్టెంబర్ 17న ఎమ్మెల్సీగా ఆయన జెండా ఎగురవేస్తారని జీఏడీ జీవో ఎలా ఇస్తుందని హరీశ్ ప్రశ్నించారు. అనర్హత వేటు వే యాల్సిన కౌన్సిల్ చైర్మన్.. స్వయంగా మహేందర్‌రెడ్డి చీఫ్‌విప్‌గా నియమి తులైనట్లు బులెటిన్ ఇవ్వటం సరికాదన్నారు. పట్నం మహేందర్‌రెడ్డి ఇప్పుడు ఏ పార్టీకి చెందిన వ్యక్తో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు.

# డీయూ మాజీ ప్రొఫెసర్ సాయిబాబా కన్నుమూత

సుప్రీంకోర్టు ఆదేశాలతో బాంబే హైకోర్టు విచారణ చేపట్టింది. సాయిబాబాను నిర్దోషిగా బాంబే హైకోర్టు ప్రకటించింది. మార్చి నెలలో నాగ్‌పూర్ జైలు నుంచి ఆయన విడుదలయ్యారు. సాయిబాబా 1967లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తూర్పుగోదావరి జిల్లా అమలాపురంలో ఒక పేద రైతు కుటుంబంలో జన్మించారు. ఆయన పోలియో కారణంగా ఐదేళ్ల వయస్సు నుంచి వీల్ చైర్‌ను ఉపయోగిస్తున్నారు. ఆయన జైలులో ఉన్న సమయంలో అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొన్నారు. సాయిబాబా ఢిల్లీ విశ్వవిద్యాలయంలోని రామ్ లాల్ ఆనంద్ కళాశాలలో చాలా ఏళ్లు ఇంగ్లీష్ బోధించారు. ఆయన మావోయిస్టులతో సంబంధాలు కలిగి ఉన్నారనే కేసులో జైలుకు వెళ్లారు. దీంతో ఫిబ్రవరి 2021లో ఢిల్లీ విశ్వవిద్యాలయంలోని రామ్ లాల్ ఆనంద్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పదవి నుండి తొలగించబడ్డారు. మావోయిస్టులతో లింకు ఉందన్న కారణంగా మహారాష్ట్ర పోలీసులు 2014లో ఢిల్లీ యూనివర్సిటీ రామ్‌లాల్‌ఆనంద్ కాలేజీ ప్రొఫెసర్ సాయిబాబాను అరెస్టు చేశారు. ఐపీసీతో పాటు ఉగ్రవాద కార్యకలాపాల నిరోధక చట్టం(యూఏపీఏ)సెక్షన్ల కింద ఆయనపై ఛార్జ్‌షీట్ నమోదు చేశారు. 2017 వరకు ఈ కేసు విచారించిన గడ్చిరోలి జిల్లా సెషన్స్‌కోర్టు సాయిబాబాతో పాటు మరో ఐదుగురికి జీవిత ఖైదు విధించింది. శిక్ష పడిన తర్వాత ఆయనను ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఉద్యోగం నుంచి తొలగించింది. సెషన్స్‌కోర్టు ఇచ్చిన జీవితఖైదు తీర్పుపై సాయిబాబా అప్పీల్‌కు వెళ్లగా యూఏపీఏ కేసులో ప్రొసీజర్‌ను పోలీసులు సరిగా పాటించలేదన్నా కారణంగా బాంబే హైకోర్టు 2022లోనే సాయిబాబాపై కేసును కొట్టివేసింది. కానీ వెంటనే మహారాష్ట్ర ప్రభుత్వం ఈ తీర్పుపై సుప్రీంకోర్టుకు అప్పీల్‌కు వెళ్లగా అత్యున్నత కోర్టు సాయిబాబా విడుదలపై స్టే ఇచ్చింది. కేసును తిరిగి వినాలని బాంబే హైకోర్టుకే రిఫర్ చేసింది.



# రక్తమోడిన దేవరగట్టు

ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం ఆదోని, ఆలూరు, గుంతకల్లు, కర్నూలు ఆస్పత్రులకు తరలించారు. మిగిలిన వారికి హెల్త్ క్యాంప్‌లో చికిత్స అందించారు. శనివారం అర్ధరాత్రి ప్రారంభమైన మాళ మల్లేశ్వరస్వామి జైత్రయాత్ర ఆదివారం ఉదయం వరకు సాగింది. ఉత్సవాలు నిర్వహించే నెరణికి, నెరణికి తండా, కొత్తపేట భక్తులు డోలు, మేళతాళాలతో ఇనుప తొడుగులు తొడిగిన రింగు కర్రలు, అగ్గి దివిటీలతో అర్ధరాత్రి 12.20 గంటలకు కొండపై ఉన్న స్వామివారి ఆలయానికి చేరుకున్నారు.

**కళ్యాణోత్సవం అనంతరం..**

ఒంటి గంట వరకు నెరణికి పురోహితులు, ఆలయ పూజారులు మాత మాళమ్మ, మల్లేశ్వరునికి అత్యంత వైభవంగా కల్యాణోత్సవం జరిపించారు. అనంతరం మాళమ్మ, మల్లేశ్వరుని విగ్రహాలతో పాటు పల్లకిని ఊరేగింపుగా కొండ దిగువకు వచ్చి మల్లప్ప గుడిలోని సింహాసన కట్ట మీద అధిష్టింపచేశారు. ఆ సమయంలో వారితో పాటు నిట్రవట్టి, బిలేహాల్, విరుపాపురం, ఎల్లార్తి, సుళువాయి, అరికెర, అరికెర తాండా, కురుకుంద, లింగంపల్లి తదితర గ్రామాల భక్తులు మొగలాయిల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తుల చేతుల్లో ఉన్న రింగు కర్రలు తగిలి చాలామంది గాయపడ్డారు.తలలు పగిలాయి. మొగలాయి ఆడుతున్న కొందరు కాగడాలతో దారి చేసుకుంటూ ముందుకు సాగారు. కొందరు అగ్గి కాగడాలను భక్తులపై విసిరి భయాందోళనకు గురి చేశారు. అనంతరం అక్కడి నుంచి మొదలైన జైత్రయాత్ర ముళ్లబండ, పదాలగట్టు, రక్షనడి, శమీ వృక్షం, బసవన్న గుడి మీదుగా ఉత్కంఠంగా ముందుకు సాగింది. స్వామి విగ్రహాలు సింహాసన కట్టకు చేర్చి జైత్రయాత్రను విజయవంతం చేసి భక్తులు తిరుగు ప్రయాణమయ్యారు. జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఆధ్వర్యంలో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరధ్వాజ, పత్తికొండ ఆర్డీఓ భరత్‌నాయక్ పర్యవేక్షణలో భారీ బందోబస్తు నిర్వహించారు. సోమవారం సాయంత్రం మాళ మల్లేశ్వరస్వామి రథోత్సవం ఘనంగా జరగనుంది.

క్రైమ్ మిర్రర్

Voice of Anti Corruption

# బిజినెస్






## కోట్ల జీఎస్టీ ఎగవేతపై నోటీసులు

హైదరాబాద్: రూ.1,400 కోట్ల జీఎస్టీ ఎగవేతపై కమర్షియల్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్ మాజీ కమిషనర్ టీకే శ్రీదేవి నేతృత్వంలో ఏర్పాటైన అత్యున్నత స్థాయి కమిటీ దూకుడు పెంచింది. ఈ జీఎస్టీ ఎగవేతపై శుక్రవారం 17 సంస్థలకు నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది. ఈ జీఎస్టీ కుంభకోణంలో మొత్తం 75 కంపెనీలపై పోలీసులు అభియోగాలు నమోదు చేయగా, వీటిలో పన్నులు ఎగవేసిన 17 సంస్థలకు తాజాగా నోటీసులు జారీ చేశారు. ఇందులో ఏడుకొండలు లేబర్ కాంట్రాక్టర్ కో-ఆపరేటివ్ సొసైటీ కూడా ఉన్నట్లు సమాచారం. ఈ సంస్థ వాణిజ్య శాఖకు రూ.7.66 లక్షలు ఎగవేసినట్లు నోటీసులో పేర్కొన్నది. జూలై 1, 2017లో ఏడుకొండలు రిజిస్టర్ అవగా, మార్చి 20, 2023న తన రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసుకున్నది. ఈ మధ్యకాలంలో జీఎస్టీ రిటర్ను దాఖలు చేయడంలో అవకతవకలు జరిగినట్లు అధికారులు గుర్తించారు. కాగా, ఈ కేసులో నమోదైన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ అధికారులు ఈ స్కామ్‌పై దృష్టి సారించినట్లు విశ్వసనీయంగా తెలిసింది.

## రిలయన్స్ డిజిటల్ ఫెస్టివల్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్

Reliance digital

హైదరాబాద్: దేశంలో అతిపెద్ద ఎలక్ట్రానిక్ రిటైల్ దిగ్గజం రిలయన్స్ డిజిటల్.. 'ఫెస్టివల్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్' ప్రత్యేక ఆఫర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ దసరా పండుగ సందర్భంగా ఏదైన కార్డుతో కొనుగోలుపై రూ.10 వేల వరకు ఇన్‌స్టంట్ డిస్కౌంట్‌తోపాటు రూ.22,500 వరకు ఇతర ప్రయోజనాలు కూడా కల్పిస్తున్నది. ఈ ఆఫర్లలో భాగంగా రూ.27,499కే 55 ఇంచుల 4కే స్మార్ట్ టీవీ, రూ.1,14, 990కే ఎల్‌జీ ఒలెడ్ ఈవీ 4కే స్మార్ట్ టీవీపై మూడేండ్ల వ్యారెంటీ కల్పిస్తున్నది. అలాగే సామ్‌సంగ్ నియో క్యూలెడ్ 4కే స్మార్ట్ టీవీపై మూడేండ్ల వ్యారెంటీ, 20 శాతం వరకు క్యాష్‌బ్యాక్, దీంతోపాటు 42,490 విలువైన సామ్‌సంగ్ 4కే యూహెచ్‌డీ టీవీని ఉచితంగా ఇస్తున్నది. గృహోపకరణాలపై 15 శాతం వరకు రాయితీతో విక్రయిస్తున్నది.

## కార్లు, బైక్‌లు అబ్బో.. అదృష్టమంటే ఈ ఐటీ కంపెనీ ఉద్యోగులదే!




చెన్నైకి చెందిన టీమ్ డిటైలింగ్ సొల్యూషన్స్ అద్భుతమైన బహుమతులతో తమ ఉద్యోగులను ఆశ్చర్యపరిచింది. 28 కార్లు, 29 బైక్‌లను బహుమతిగా ఇచ్చింది. ఉద్యోగుల్లో మరింత ప్రేరణ కల్పించడానికి, ఉత్పాదకతను పెంచడానికి కంపెనీ ఈ చర్య చేపట్టినట్లు తెలుస్తోంది. 2005లో ప్రారంభమైన టీమ్ డిటైలింగ్ సొల్యూషన్స్ స్ట్రక్చరల్ స్టీల్ డిజైన్, డిటైలింగ్ సేవలను అందిస్తోంది. కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీధర్ కణ్ణన్ మీడియాతో మాట్లాడుతూ, ఉద్యోగుల కష్టాన్ని గుర్తించి, అభినందించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. ఈ గుర్తింపు ఉద్యోగులను తమ పాత్రల్లో రాణించేలా మరింత ప్రేరేపిస్తుందని కంపెనీ అభిప్రాయపడింది. ఉద్యోగులకు బహుమతిగా ఇచ్చిన కార్లలో మారుతీ సుజుకీ, హ్యుందాయ్ వంటి కంపెనీలతోపాటు మెర్సిడెస్ బెంజ్ కార్లు కూడా ఉండటం విశేషం. కార్లు, బైక్‌లతో పాటు, టీమ్ డిటైలింగ్ సొల్యూషన్స్ తమ ఉద్యోగులకు వివాహ కానుకను కూడా అందిస్తోంది. గతంలో రూ.50,000గా ఉన్న ఈ కానుకను ఈ ఏడాది రూ.లక్షకు కంపెనీ పెంచింది.



## రోబో ట్యాక్సీ, రోబో వ్యాన్‌ను పరిచయం చేసిన ఎలాన్ మస్క్

బిలియనీర్ ఎలాన్ మస్క్ తన సృజనాత్మకతతో మరోసారి ప్రపంచం దృష్టిని ఆకర్షించారు. తన సంస్థ రూపొందించిన డ్రైవర్ రహిత కారు 'రోబో ట్యాక్సీ'ని ఆవిష్కరించారు. కాలిఫోర్నియాలోని వార్నర్ బ్రదర్స్ ప్రాంగణంలో జరిగిన 'వీరోబో' కార్యక్రమంలో ఈ ట్యాక్సీని ప్రదర్శించారు. రెండు డోర్లతో ఉన్న ఈ కారుకు స్టీరింగ్ వీల్, పెడల్స్ లేకపోవడం విశేషం. పూర్తిగా ఎలక్ట్రిక్ కారు ఇది. 30 వేల డాలర్ల కంటే తక్కువకే ఇది అందుబాటులో ఉంటుందని మస్క్ పేర్కొన్నారు. సాధారణ వాహనాల కంటే ఇది 10 నుంచి 20 రెట్లు సురక్షితంగా ఉంటుందని టెస్లా సీఈవో వెల్లడించారు. దీన్ని మస్క్ సైబర్ క్యాబ్‌గా పరిచయం చేశారు. 2027 లోపు ఈ ట్యాక్సీని అందుబాటులోకి తెస్తామని ప్రామిస్ చేశారు.

## కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇకపై భారీగా రిటైర్మెంట్ సొమ్ము



కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇకపై రిటైర్మెంట్ సొమ్ము భారీగా పెరగనుంది. ఈ మేరకు నేషనల్ పెన్షన్ సిస్టమ్‌లో నిబంధనలను ప్రభుత్వం సవరించింది. పెన్షన్, పెన్షనర్ల సంక్షేమ శాఖ నేషనల్ పెన్షన్ సిస్టమ్ పరిధిలోకి వచ్చే కేంద్ర ప్రభుత్వ సివిల్ ఉద్యోగుల సర్వీస్ సంబంధిత విషయాలను నియంత్రించడానికి సెంట్రల్ సివిల్ సర్వీసెస్ (నేషనల్ పెన్షన్ సిస్టమ్ అమలు) రూల్స్, 2021ని నోటిఫై చేసింది. కేంద్ర ప్రభుత్వ సిబ్బందికి ఎన్‌పీఎస్ కింద ఉద్యోగి ప్రాథమిక వేతనంలో యజమాని చెల్లించే మొత్తాన్ని 14 శాతానికి పెంచాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇటీవలి కేంద్ర బడ్జెట్ 2024-25లో ప్రతిపాదించారు. కేంద్ర సిబ్బంది, పబ్లిక్ గ్రీవెన్స్,పెన్షన్ల మంత్రిత్వ శాఖ పరిధిలోకి వచ్చే పెన్షనర్ల సంక్షేమ విభాగం ఎన్‌పీఎస్ కింద చెల్లించే మొత్తాలను వివరిస్తూ కొత్త ఆఫీస్ మెమోరాండమ్‌ను విడుదల చేసింది. సెంట్రల్ సివిల్ సర్వీసెస్ (నేషనల్ పెన్షన్ సిస్టమ్ అమలు) రూల్స్, 2021లోని రూల్ 7 ప్రకారం.. కేంద్ర ప్రభుత్వం ప్రతి ఉద్యోగి జీతంలో 14 శాతాన్ని వారి వ్యక్తిగత పెన్షన్ ఖాతాకు ప్రతి నెలా జమ చేస్తుంది. మెడికల్ లీవ్, ఉన్నత విద్య కోసం వెళ్లడం కొన్ని సందర్భాలలో మినహా ఉద్యోగి పెన్షన్ కాంట్రిబ్యూషన్ చెల్లించని సమయంలో ప్రభుత్వం కూడా తన వంతు మొత్తాన్ని చెల్లించదు. ఇక ఉద్యోగి సస్పెన్షన్‌లో ఉన్నప్పుడు పెన్షన్ కాంట్రిబ్యూషన్స్ ఉద్యోగికి చెల్లించే జీవనాధార భత్యంపై ఆధారపడి ఉంటాయి. సస్పెన్షన్ కాలం తరువాత ఒకవేళ అది జీతం చెల్లించాల్సిన డ్యూటీ లేదా సెలవుగా వర్గీకరిస్తే ఆ మేరకు ప్రభుత్వం చందాలను సర్దుబాటు చేస్తుంది. ఉద్యోగులు ఫారిన్ సర్వీస్‌లో ఉన్నప్పుడు ఎన్‌పీఎస్ చందాలకు సంబంధించి కూడా మెమోరాండం వివరించింది. ఇవి డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ జారీ చేసిన మార్గదర్శకాలను అనుసరిస్తాయి.

## మార్కెట్‌లోకి కొత్తరకం ఫ్లోర్ క్లీనర్.. చార్జ్ పెడితే చాలు!

తడి, పొడి చెత్తను ఏక కాలంలో తొలగించి ఫ్లోర్‌ను పరిశుభ్రం చేసే ప్రత్యేకమైన కార్డ్-ఫ్రీ వెట్ ఫ్లోర్ క్లీనర్‌ను డైసన్ కంపెనీ మార్కెట్‌లోకి విడుదల చేసింది. దీని పేరు డైసన్ వాష్‌జీ1. పరిశుభ్రమైన శుభ్రత, నిర్వహణ కోసం దీన్ని రూపొందించినట్లు కంపెనీ తెలిపింది. ఈ కొత్త రకం ఫ్లోర్ క్లీనర్ ధర రూ. 64,900. వాష్‌జీ1 ఫ్లోర్ క్లీనర్ ఒక లీటర్ ట్యాంక్‌తో వస్తుంది. తడి, పొడి చెత్తను ఒకేసారి శుభ్రం చేయడానికి హైడ్రేషన్, శోషణ, ఎక్స్‌ట్రాక్షన్ పద్ధతుల కలయికను ఉపయోగిస్తుంది. ఇది ఒక ఛార్జ్‌లో 3100 చదరపు అడుగుల విస్తీర్ణాన్ని కవర్ చేస్తుంది. ఈ క్లీనర్‌ను దేశం అంతటా డైసన్ వెబ?సైట్‌లో ఆన్‌లైన్‌తోపాటు ఆఫ్‌లైన్‌లో డైసన్ డెమో స్టోర్‌ల నుండి కొనుగోలు చేయవచ్చు.




## సూపర్ ఫాస్ట్ రోబో ఆవిష్కరణ!

### చెట్టులెక్కగలవా? ఓ నరహరి పుట్టలెక్కగలవా?

### చెట్టులెక్కి.. ఆ చిటారు కొమ్మన చిగురు కోయగలవా?

### అప్పుడెప్పుడో లక్ష్మీదేవి పెట్టిన వర పరీక్ష ఇది!



ఇప్పుడా అవసరం మనిషికి లేదు కానీ.. అన్ని రంగాల్లోకీ దూసుకొస్తున్న యంత్రులకు అదేనండి రోబోలకు కావాలి. ఎందుకంటే.. చెట్టూ పుట్ట ఎక్కే రోబోలను మరిన్ని ఎక్కువ చోట్ల వాడుకోవచ్చు మరి. ఇప్పటివరకూ తయారైన రోబోలు కొంచెం తడబడుతూ మెట్లు ఎక్కగలిగేవి కానీ.. స్విట్జర్లాండ్‌లోని ఈటీహెచ్ జూరిక్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ అభివృద్ధి చేసిన 'ఎనిమల్' మాత్రం చాలా వేగంగా నాలుగు కాళ్లతో నిచ్చెన మెట్లు ఎక్కేయగలదు. రెండు కాళ్లపై నుంచోవడం, అడ్డ కూలీల్లా బాక్స్‌లను దూరంగా విసిరివేయడం, ఎక్కినంత వేగంగా మెట్లు దిగగలగడం వంటి పనులన్నీ ఠకీ మని చేసేయగలదీ రోబో. ఏడేళ్ల క్రితం ఈ సంస్థ స్కైస్కాపర్లలో ఎలివేటర్లను వాడుకునే శక్తిగల రోబోలను తయారు చేసింది. అప్పటి నుంచి ఇది ఎనీబోటిక్స్ అనే సంస్థ ద్వారా వాణిజ్యస్థాయిలో అందుబాటులో ఉంది కూడా. తాజాగా ఈ సంస్థే 'ఎనిమల్'ను అభివృద్ధి చేసింది. ఎనిమల్ నిమిషానికి 0.75 మీటర్ల వేగంతో నడవగలదు. ఒకసారి ఛార్జ్ చేస్తే ఎత్తుపల్లాలతో సంబంధం లేకుండా గంటన్నర నుంచి రెండు గంటల పాట పనిచేస్తుంది. ఇంటా బయట ఎక్కడైనా సరే.. అడ్డంకులను తప్పించుకుని ప్రయాణించగలదు. చుట్టూ జరుగుతున్న విషయాలను చూసి అర్థం చేసుకునేందుకు వీలుగా ఇందులో 360 డిగ్రీ లైడర్ మాడ్యూల్, లోతును అంచనా కట్టేంఉదకు ఆరు సెన్సింగ్ కెమెరాలు, చూపునకు రెండు కెమెరాలు ఉన్నాయి.

## బీఎస్‌ఎన్‌ఎల్ కొత్త రీచార్జ్.. 105 రోజులు అన్‌లిమిటెడ్




రీఛార్జ్ ప్లాన్ వ్యాలిడిటీ చివరి రోజు దగ్గర పడుతున్నకొద్దీ కస్టమర్‌లు టెన్షన్ పడుతూ ఉంటారు. అధిక వ్యాలిడిటీ ఉన్న ప్లాన్‌లు రీచార్జ్ చేసుకుందామంటే ధర ఎక్కువగా ఉంటోంది. ఇలాంటి వారి కోసం ప్రభుత్వ టెలికాం సంస్థ బీఎస్‌ఎన్‌ఎల్ తక్కువ ఖర్చుతో కూడుకున్న ప్లాన్‌లను పరిచయం చేస్తోంది. ప్రైవేట్ టెలికాం సంస్థలు దీర్ఘకాలిక చెల్లుబాటు గల ప్లాన్‌ల కోసం అధిక ఛార్జీలు విధిస్తున్నాయి. ఈ నేపథ్యంలో వినియోగదారులు బీఎస్‌ఎన్‌ఎల్ వైపు చూస్తున్నారు. లక్షల మంది వినియోగదారుల కోసం బీఎస్‌ఎన్‌ఎల్ తన ఆఫర్లలో అనేక దీర్ఘకాలిక చెల్లుబాటు ప్లాన్‌లను చేర్చింది. తాజాగా 105 రోజుల వ్యాలిడిటీతో అద్భుతమైన ప్లాన్‌ను తీసుకొచ్చింది.

### 105 రోజుల వ్యాలిడిటీ ప్లాన్

బీఎస్‌ఎన్‌ఎల్ తమ వినియోగదారులకు అధిక వ్యాలిడిటీని అందిస్తూ రూ. 666 ధరతో అత్యుత్తమ రీఛార్జ్ ప్లాన్‌ను ప్రవేశపెట్టింది. ఈ ప్రీపెయిడ్ ప్లాన్‌లో 105 రోజుల పాటు ఏదైనా నెట్‌వర్క్‌కి అపరిమిత కాలింగ్ ఉంటుంది. అదనంగా ప్రతిరోజూ 100 ఉచిత ఎస్‌ఎంఎస్‌ల ప్రయోజనాన్ని పొందవచ్చు. అంతేకాకుండా చెల్లుబాటు వ్యవధికి మొత్తం 210 జీబీ డేటాను అందిస్తోంది. అంటే రోజువారీ 2జీబీ హై-స్పీడ్ డేటాకు సమానం. ఈ ధరతో ఇతర ప్రైవేటు టెలికాం కంపెనీల్లో విస్తృతమైన వ్యాలిడిటీ ప్లాన్‌లు లేవు.

# సిన్నర్‌దే షాంఘై మాస్టర్స్

### ఫైనల్‌లో జొకోవిచ్ పరాభవం

షాంఘై (చైనా): ఇటలీ కుర్రాడు జన్నిక్ సిన్నర్ షాంఘై మాస్టర్స్ టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. సెర్బియా సూపర్ స్టార్ నొవాక్ జొకోవిచ్‌ను ఫైనల్‌లో వరుస సెట్లలో చిత్తుచేసి ట్రోఫీని గెలిచాడు. పురుషుల సింగిల్స్ ఫైనల్‌లో భాగంగా ఆదివారం జరిగిన తుదిపోరులో ప్రపంచ ఒకటో నెంబర్ ర్యాంకర్ అయిన సిన్నర్.. 7-6 (7/4), 6-3తో జొకోవిచ్‌ను ఓడించాడు. ఈ టోర్నీ గెలిచి తన కెరీర్‌లో వందో టూర్ టైటిల్ నెగ్గాలని భావించిన జొకోకు సిన్నర్ షాకిచ్చాడు. పురుషుల టెన్నిస్‌లో జిమ్మీ కానర్స్ (109), రోజర్ ఫెదరర్ (103) మాత్రమే ఈ ఘనత సాధించారు. వూహాన్ ఓపెన్ విజేత సబలెంక: వూహాన్ ఓపెన్‌లో బెలారస్ అమ్మాయి అరీనా సబలెంక విజేతగా నిలిచింది. ఫైనల్‌లో సబలెంక.. 6-3, 5-7, 6-3తో పారిస్ ఒలింపిక్స్‌లో స్వర్ణం గెలిచిన చైనా ప్లేయర్ కిన్వెన్ జెంగ్‌ను ఓడించింది. ఈ ఏడాది సబలెంకకు ఇది నాలుగో టైటిల్ కావడం విశేషం.



# భారత్ 297/6

- ఉప్పల్‌లో టీమ్‌ఇండియా రికార్డు స్కోరు
- టీ20లలో అత్యధికం
- సంజూ శాంసన్ మెరుపు శతకం
- సిరీస్ 3-0తో క్లీన్ స్వీప్

**రికార్డుల అడ్డా ఉప్పల్ స్టేడియం పేరు అంతర్జాతీయ క్రికెట్‌లో మరోసారి మార్మోగింది. శనివారం ఇక్కడి రాజీవ్‌గాంధీ స్టేడియంలో బంగ్లాదేశ్‌తో జరిగిన మూడో టీ20 మ్యాచ్‌లో భారత్.. అంతర్జాతీయ క్రికెట్ చరిత్రలో మునుపెన్నడూ చూడని విధంగా 20 ఓవర్లలోనే 297 పరుగుల రికార్డు స్కోరు సాధించింది.**

**అత్యంత పోటీతత్వమున్న భారత జట్టులో స్థానం నిలుపుకోవాలంటే తప్పకుండా ఆడాల్సిన మ్యాచ్‌లో సంజూ శాంసన్.. బంగ్లా బౌలర్లపై శివతాండవమే ఆడాడు. కొడితే సిక్స్ లేకుంటే ఫోర్ అన్న రేంజ్‌లో సాగిన అతడి విధ్వంసానికి సారథి సూర్యకుమార్ యాదవ్ నాటు కొట్టుడు.. ఆఖర్లో హార్దిక్ పాండ్యా, రియాన్ పరాగ్ మెరుపులు తోడవడంతో టీమ్‌ఇండియా కొత్త చరిత్ర లిఖించింది. అనంతరం భారత బౌలర్ల విజృంభణతో బంగ్లాదేశ్‌ను చిత్తుగా ఓడించి సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసింది.**



హైదరాబాద్: స్వదేశంలో బంగ్లాదేశ్‌తో జరిగిన మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను సూర్యకుమార్ యాదవ్ నేతృత్వంలోని యువ భారత జట్టు క్లీన్ స్వీప్ చేసింది. హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియం వేదికగా శనివారం ముగిసిన మూడో టీ20లో టీమ్‌ఇండియా 133 పరుగుల భారీ తేడాతో జయకేతనం ఎగురవేసి సిరీస్‌ను 3-0తో గెలుచుకుంది. వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్ (47 బంతుల్లో 111, 11 ఫోర్లు, 8 సిక్సర్లు) రికార్డు శతకానికి తోడు సూర్యకుమార్ (35 బంతుల్లో 75, 8 ఫోర్లు, 5 సిక్సర్లు) మెరుపులు జతకలవడంతో నిర్ణీత 20 ఓవర్లలో భారత్ 6 వికెట్ల నష్టానికి 297 పరుగుల రికార్డు స్కోరు చేసింది. అనంతరం ప్రత్యర్థిని 20 ఓవర్లలో 164/7 వద్దే కట్టడి చేసి భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. బంగ్లా తరఫున తౌహిద్ హృదయ్ (42 బంతుల్లో 63 నాటౌట్, 5 ఫోర్లు, 3 సిక్సర్లు) పోరాడాడు. ఈ మ్యాచ్‌లో సెంచరీ హీరో శాంసన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కగా సిరీస్ ఆసాంతం రాణించిన హార్దిక్ పాండ్యాకు 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' లభించింది.

**సంజూ, సూర్య ఊచకోత**

గత రెండు మ్యాచ్‌లలో విఫలమై తదుపరి సిరీస్‌లలో ఉంటాడో? లేదో? అన్న పరిస్థితుల్లో క్రీజులోకి వచ్చిన శాంసన్.. రెండో ఓవర్ నుంచే బ్యాట్‌కు పనిచెప్పాడు. టస్కిన్ అహ్మద్ వేసిన రెండో ఓవర్లో 4 ఫోర్లు కొట్టి తన ఉద్దేశాన్ని చెప్పకనే చెప్పాడు. అభిషేక్ శర్మ (4) మళ్లీ నిరాశపరిచినా కెప్టెన్ సూర్యతో శాంసన్ జతకలవడంతో అగ్నికి వాయువు తోడైనట్టైంది. ఈ ఇద్దరూ బంగ్లా బౌలర్లను ఊచకోత కోశారు. సిక్సర్‌తోనే ఖాతా తెరిచిన సూర్య.. ఇన్నింగ్స్ ఆసాంతం అదే దూకుడును ప్రదర్శించాడు.

పవర్ ప్లే ముగిసేసరికి భారత్ స్కోరు 82/1గా నమోదైంది. అంతర్జాతీయ టీ20 చరిత్రలో ఇదే రికార్డు. రిషద్ హొసేన్ ఏడో ఓవర్లో సంజూ 4, 4, 6తో 22 బంతుల్లోనే అర్థ సెంచరీని పూర్తిచేసుకున్నాడు. ఈ ఇద్దరూ పోటీపడి బౌండరీలు, సిక్సర్లు బాదడంతో 7.1 ఓవర్లలోనే టీమ్‌ఇండియా స్కోరు వంద పరుగులు దాటేసింది. రిషదే వేసిన పదో ఓవర్‌లో అయితే సంజూ బాదుడుకు బంగ్లా ఫీల్డర్ల కండ్లు బైర్లు కమ్మాయి. ఆ ఓవర్ తొలి బంతిని మినహాయిస్తే మిగిలిన ఐదు బంతులకూ 6, 6, 6, 6, 6తో మొత్తంగా 30 పరుగులు వచ్చాయి. మహ్మదుల్లా వేసిన 11వ ఓవర్లో లెగ్ సైడ్ దిశగా రెండు రన్స్ తీసిన సూర్య 23 బంతుల్లో ఫిఫ్టీ సాధించాడు. వరుసగా 5 సిక్సర్లతో సెంచరీకి చేరువైన సంజూ.. మెహిది హసన్ 13వ ఓవర్లో తొలి బంతినే బౌండరీకి తరలించి 40 బంతుల్లోనే తన తొలి శతకాన్ని పూర్తిచేశాడు. సెంచరీ తర్వాత సంజూను ముస్తాఫిజుర్ ఔట్ చేయడంతో రికార్డు భాగస్వామ్యానికి తెరపడింది. ఈ ఇద్దరూ కలిసి 70 బంతుల్లోనే 173 పరుగులు జతచేయడం విశేషం. శాంసన్ ఔట్ అయ్యాక తదుపరి ఓవర్లోనే సూర్య కూడా పెవిలియన్ చేరినా చివరి ఓవర్లలో హార్దిక్ పాండ్యా (18 బంతుల్లో 47, 4 ఫోర్లు, 4 సిక్సర్లు), రియాన్ పరాగ్ (13 బంతుల్లో 34, 1 ఫోర్, 4 సిక్సర్లు) మెరుపులు మెరిపించడంతో భారత్ భారీ స్కోరు సాధించింది.

**బంగ్లా ఏ దశలోనూ..**

భారీ ఛేదనలో బంగ్లాదేశ్ ఏ దశలోనూ లక్ష్యం దిశగా సాగలేదు. బంగ్లా ఇన్నింగ్స్ తొలి బంతికే మయాంక్ యాదవ్ బౌలింగ్‌లో పర్వేజ్ హొసేన్ రియాన్ పరాగ్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరగడంతో ఆ జట్టుకు తొలి షాక్ తాకింది. తాంజిద్ హసన్ (15), కెప్టెన్ నజ్ముల్ హొసేన్ శాంతో (14) విఫలమయ్యారు. లిటన్ దాస్ తో కలిసి తౌహిద్ హృదయ్ కాసేపు పోరాడినా క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోవడంతో ఆ జట్టుకు ఓటమి తప్పలేదు,



## సెమీస్‌కు ఆసీస్.. భారత్ ఓటమి

షార్జా: ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్‌లో భాగంగా సెమీస్ రేసులో నిలవాలంటే భారీ తేడాతో తప్పక నెగ్గాల్సిన మ్యాచ్‌లో భారత అమ్మాయిల జట్టు చేతులెత్తేసింది. ఆదివారం షార్జా వేదికగా జరిగిన మ్యాచ్‌లో భారత్‌ను 9 పరుగుల తేడాతో ఓడించిన ఆస్ట్రేలియా సెమీస్‌కు ప్రవేశించింది. మొదట బ్యాటింగ్ చేసిన ఆసీస్.. 20 ఓవర్లలో 151/8 పరుగులు చేసింది. గ్రేస్ హారీస్ (40), ఎల్లీస్ పెర్రీ (32) రాణించారు. ఛేదనలో హర్మన్‌ప్రీత్ కౌర్ (54 నాటౌట్) అర్ధ సెంచరీతో పోరాడినా 20 ఓవర్లలో భారత్ 142/9 వద్దే ఆగిపోయింది. నేడు న్యూజిలాండ్, పాకిస్థాన్ మధ్య జరగాల్సిన మ్యాచ్ ఫలితంపై భారత్ సెమీస్ అవకాశాలు ఆధారపడి ఉన్నాయి. కివీస్ ఓడిపోతేనే మన అమ్మాయిలకు సెమీస్ చేరడానికి అవకాశముంటుంది.

## రికార్డులకు అడ్డా ఉప్పల్



ఉప్పల్ స్టేడియం రికార్డులకు అడ్డాగా మారిందని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అధ్యక్షుడు అర్శనపల్లి జగన్‌మోహన్ రావు అన్నారు. శనివారం బంగ్లాతో మ్యాచ్‌లో భాగంగా టీ20లలో అత్యధిక స్కోరు (297) నమోదుచేసిన గ్రౌండ్‌గా ఉప్పల్ పేరు క్రికెట్ చరిత్ర పుస్తకాల్లో నిలవడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. మ్యాచ్‌ను విజయవంతం చేసేందుకు గాను గత పది రోజులుగా అహర్నిశలు శ్రమించిన హెచ్‌సీఏ కార్యవర్గ సభ్యులు, క్లబ్ సెక్రటరీలు, ఇతర సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సిరీస్ గెలిచిన భారత సారథి సూర్యకు జగన్‌మోహన్ రావు విజేత ట్రోఫీని బహూకరించారు.

## ఓవరాల్ చాంప్ వైష్ణవి

ఈనెల 4 నుంచి 13 మధ్య దక్షిణాఫ్రికాలోని సన్‌సిటీలో జరిగిన కామన్వెల్త్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో భాగంగా 84 కిలోల విభాగం (స్కాట్, బెంచ్ ప్రెస్)లో స్వర్ణంతో పాటు మొత్తంగా మూడు పసిడి పతకాలు గెలిచిన హైదరాబాదీ అమ్మాయి మహేష్ వైష్ణవి.



## టీటీలో మూడు కాంస్యాలు

ఆస్థానా (కజకిస్థాన్): ఆసియా టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో భారత ప్యాడ్లర్లు మూడు కాంస్యాలతో మెరిశారు. కజకిస్థాన్ వేదికగా జరుగుతున్న ఈ టోర్నీలో ఆదివారం మహిళల డబుల్స్ సెమీస్ పోరులో ఐహిక ముఖర్జీ, సుతీర్థ ముఖర్జీ ద్వయం.. 4-11, 9-11, 8-11తో మివా హరిమొటో, మియు కిహారా (జపాన్) చేతిలో ఓడి కాంస్యంతో సరిపెట్టుకుంది. ఈ టోర్నీలో ఇదివరకే భారత మహిళల జట్టు (మనికా బత్రా, ఐహిక ముఖర్జీ, సుతీర్థ ముఖర్జీ) చారిత్రాత్మక కాంస్యం నెగ్గగా పురుషుల జట్టు (ఆచంట శరత్ కమల్, మానవ్ ఠక్కర్, హర్మీత్ దేశాయ్) సైతం కాంస్యం గెలిచిన విషయం తెలిసిందే. 1972 నుంచి ఈ టోర్నీ జరుగుతుండగా మహిళల టీమ్ ఈవెంట్‌లో భారత్ పతకం గెలవడం ఇదే తొలిసారి కావడం విశేషం.

GHMC
hmda Growing Global
TS-bPASS
MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com

SRI SWAMI ASSOCIATES
ARCHITECTS • ENGINEERS • SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissons, LRS, BRS, Tax Assesments
GHMC, HMDA, DTCP, TS-bpass, Layout, Building Permissions
వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.
H.No. 11-5-565, Bhagya Laxmi Towers,
Opp: GHMC Circle Office,
Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595



# ప్రతినిధి 2 హీరోయిన్‌తో నారా రోహిత్ నిశ్చితార్థం..

నటుడు నారా రోహిత్ త్వరలో ఓ ఇంటి వాడు కాబోతున్నాడు. ఆయనకు కళ్యాణ ఘడియలు వచ్చేశాయి. ప్రతినిధి 2 హీరోయిన్ సిరిలెల్లతో నారా రోహిత్ పెళ్లి జరగనుంది. అయితే ఆదివారం ఉదయం హైదరాబాద్‌లో కుటుంబ సభ్యుల సమక్షంలో నారా రోహిత్ నిశ్చితార్థ వేడుక జరిగింది. ఈ వేడుకకు ఏపీ సీఎం చంద్రబాబు, భువనేశ్వరి దంపతులు, సిరిలెల్ల కుటుంబ సభ్యులతో పాటు ఇరు కుటుంబాలకు చెందిన అత్యంత సన్నిహితులు హాజరయ్యారు. నిశ్చితార్థం అనంతరం నారా రోహిత్, సిరిలెల్లకు కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు చెప్పారు. ఇక రోహిత్, సిరిలెల్ల ఎంగేజ్‌మెంట్‌కు చెందిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. చంద్రబాబు తమ్ముడి కుమారుడే నారా రోహిత్. ఈయన 'బాణం' సినిమాతో టాలీవుడ్‌లోకి అడుగుపెట్టారు. యాక్షన్ డ్రామా ఫిల్మ్‌గా తెరకెక్కిన ఈ చిత్రంతో విమర్శకుల ప్రశంసలు అందుకున్నారు. 2011లో విడుదలైన 'సోలో'తో తొలి విజయాన్ని సొంతం చేసుకున్నారు నారా రోహిత్. ఆ తర్వాత 'సారొచ్చారు', 'ఒక్కడినే', 'ప్రతినిధి', 'రౌడీ ఫెలో', 'అసుర', 'జో అచ్యుతానంద' వంటి సినిమాల్లో నటించి మెప్పించారు రోహిత్. 2018లో విడుదలైన 'వీర భోగ వసంత రాయలు' సినిమా తర్వాత దాదాపు ఆరేండ్లు సినిమాలకు దూరంగా ఉన్నారు. ఈ ఏడాది నారా రోహిత్ హీరోగా నటించిన 'ప్రతినిధి 2' విడుదలై ప్రేక్షకులను అలరించింది. ఈ సినిమా షూటింగ్ సమయంలోనే నటి సిరితో రోహిత్‌కు ఏర్పడిన పరిచయం కాస్త ప్రేమగా మారింది. ఇరు కుటుంబాల పెద్దల అంగీకారంతో వివాహ బంధంలోకి అడుగుపెడుతున్నారు.

# బిగ్ బాస్ బ్యూటీ లీక్డ్ వీడియో వైరల్.. ఎంజాయ్ అంటూ నటి కామెంట్



ఒవియా హెలెన్.. ఇండియన్ మోడల్ అయిన ఈమె పేరు అందరికీ తెలియకపోయినా తమిళ, మలయాళ ప్రేక్షకులకు మాత్రం సుపరిచితురాలే. అయితే, తాజాగా ఆమె లీక్డ్ వీడియో అంటూ ఒకటి నెట్టింట తెగ వైరల్ అవుతుంది. తమిళ బిగ్‌బాస్ సీజన్ 1లో పాల్గొన్న ఈ కేరళ కుట్టి.. కోలీవుడ్‌లో ఒక్కసారిగా స్టార్‌గా మారిపోయింది. బిగ్ బాస్ షోను ఇష్టపడే తెలుగు వారికి కూడా ఆమె పేరు పరిచయమనే చెప్పవచ్చు. అలా సౌత్ ఇండియాలోని పలు భాషల్లో సినిమా ఛాన్సులు కూడా దక్కించుకుంది. ఒవియాకు సంబంధించిన ఒక ప్రైవేట్ వీడియో లీక్ అయిందని నెటిజన్లు రెండురోజులుగా షేర్ చేస్తున్నారు. ఈ క్రమంలో కొన్ని లింక్‌లు కూడా ఎక్స్ వేదికగా షేర్ చేస్తున్నారు. ఓవియా లీక్డ్ హ్యాష్‌ట్యాగ్‌తో ట్విటర్‌లో వైరల్ చేస్తున్నారు.కొందరైతే ఓవియాకు కూడా సోషల్‌మీడియాలో మెసేజ్‌లు పెడుతున్నారు. కేవలం 17 సెకండ్లు మాత్రమే వీడియో ఉందని ఆమెను ట్యాగ్ చేస్తూ కామెంట్ చేస్తున్నారు. మరికొందరే మాత్రం సుమారు ఒక నిమిషం పైగానే వీడియో ట్రెండ్ అవుతుందని ఒవియాకు మెసేజ్‌లు చేస్తున్నారు. ఒవియా మాత్రం తనదైన స్టైల్లో రిప్లై ఇచ్చింది. నెక్స్ట్ టైమ్ ఎక్కువ నిడివి ఉన్న వీడియో షేర్ చేస్తాలే అంటూ.. అప్పటి వరకు దీంతో ఎంజాయ్ చేయండి అని ఆమె తిరిగి సమాధానం చెప్పింది. ఒవియా పేరుతో డీప్ ఫేక్ వీడియోను క్రియేట్ చేసి ట్రెండ్ చేస్తున్నారని ఆమె అభిమానులు ఫైర్ అవుతున్నారు. ఇలాంటి వీడియోను సోషల్‌మీడియాలో షేర్ చేయవద్దని వారు పేర్కొంటున్నారు. ఈ విషయం గురించి ఒవియా ఇంకా ఎలాంటి సమాధానం చెప్పలేదు. కానీ, కేరళ సైబర్ క్రైమ్ విభాగంలో ఆమె ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది.

# విశ్వం మాస్ జాతర



గోపీచంద్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'విశ్వం'. శ్రీను వైట్ల దర్శకుడు. పీపుల్ మీడియా, చిత్రాలయం స్టూడియోస్ పతాకాలపై టీజీ విశ్వప్రసాద్, వేణు దోనేపూడి నిర్మిస్తున్నారు. నేడు ప్రేక్షకుల ముందుకురానుంది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలకు మంచి స్పందన లభించింది. తాజాగా ఈ సినిమా నుంచి 'గుంగురు గుంగురు..' అనే మాస్ గీతాన్ని విడుదల చేశారు. భీమ్స్ సిసిరోలియో కంపోజ్ చేసిన ఈ పాటను సురేష్ గంగుల రచించారు. రోహిణి సోరట్ ఆలపించారు. హుషారైన మాస్ బీట్‌తో తెరకెక్కించిన ఈ పాటలో నాయకానాయికల నృత్యాలు హైలైట్‌గా నిలిచాయి. థియేటర్‌లో ఈ పాట ఓ పండగలా ఉండబోతుందని చిత్ర బృందం పేర్కొంది. ఎమోషనల్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఈ చిత్రానికి సంగీతం: చైతన్ భరద్వాజ్, సమర్పణ: దోనేపూడి చక్రపాణి, దర్శకత్వం: శ్రీను వైట్ల.



# డేరింగ్ పోలీస్ ఝాన్సీ



లక్ష్మీరాయ్ ప్రధాన పాత్రలో నటించిన 'ఝాన్సీ ఐపీఎస్' చిత్రం కన్నడ, తమిళ భాషల్లో మంచి విజయాన్ని సాధించింది. గురుప్రసాద్ దర్శకత్వం వహించారు. ఈ సినిమా తెలుగు హక్కులను తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణ గౌడ్ సొంతం చేసుకున్నారు. ఆర్‌కే ఫిలిమ్స్ పతాకంపై ఆయన తెలుగులో రిలీజ్ చేయబోతున్నారు. ఈ సందర్భంగా ప్రతాని రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ 'యువతకు డ్రగ్స్ సరఫరా చేసే మాఫియాపై ఓ లేడీ పోలీస్ ఆఫీసర్ పోరాటం ఏమిటన్నదే ఈ చిత్ర ఇతివృత్తం. లక్ష్మీరాయ్ పాత్రలో మూడు షేడ్స్ కనిపిస్తాయి. యాక్షన్, సందేశంతో ఈ సినిమా ఆకట్టుకుంటుంది' అని చెప్పారు.

# పారితోషికం తగ్గించిన మంగళూరు భామ..

మంగళూరు భామ పూజా హెగ్డే ఇటీవలకాలంలో రేసులో కాస్త వెనకబడింది. వరుస ఫ్లాపులు ఆమెను నిరుత్సాహానికి గురిచేశాయి. అయినా ఏమాత్రం అధైర్యపడకుండా కెరీర్‌లో భారీ విజయం కోసం ప్రయత్నాలు చేస్తున్నది. తమిళ అగ్ర హీరో దళపతి విజయ్ చిత్రంలో ఈ భామ కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే.. ఈ సినిమా తన కెరీర్‌ను మలుపుతిప్పుతుందనే ఆశాభావంతో ఉంది పూజాహేగ్డే. గతంలో భారీ పారితోషికాన్ని డిమాండ్ చేసే ఆమె ప్రస్తుతం పట్టువిడుపులు ప్రదర్శిస్తున్నదట. దళపతి విజయ్ సినిమాకు తక్కువ పారితోషికం తీసుకుందని తెలిపింది. ప్రస్తుతం పూజాహెగ్డేకు తమిళం, హిందీల్లో అవకాశాలు బాగానే వస్తున్నా.. తెలుగులో మాత్రం ఇప్పటివరకు కొత్త సినిమా సైన్ చేయలేదు. తమిళంలో సూర్య 44 చిత్రంలో కూడా ఈ భామనే కథానాయికగా ఖరారైంది. ఈ రెండు చిత్రాలు తనకు పూర్వ వైభవాన్ని తీసుకొస్తాయని, తెలుగులో కూడా త్వరలో మంచి అవకాశాలు వరిస్తాయని నమ్మకంతో ఉంది పూజాహెగ్డే.



# రిలీజ్ ముందే పాస్ అయ్యాం

'దిల్‌రాజు ప్రొడక్షన్స్ ద్వారా కొత్త టాలెంట్‌ను, చిన్న చిత్రాలను ప్రోత్సహించాలనుకున్నాం. అలా 'బలగం' సినిమా వచ్చింది. ఇప్పుడు అదే తరహాలో 'జనక అయితే గనక' చిత్రాన్ని మీ ముందుకు తీసుకొస్తున్నాం. రిలీజ్‌కు ముందే ఈ సినిమాను మీడియా వారికి చూపించాం. అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది' అన్నారు అగ్ర నిర్మాత దిల్ రాజు. దిల్ రాజు ప్రొడక్షన్స్ పతాకంపై సుహాస్, సంగీర్తన జంటగా సందీప్ రెడ్డి బండ్ల దర్శకత్వంలో హర్షిత్ రెడ్డి, హన్షిత రెడ్డి నిర్మించిన 'జనక అయితే గనక' చిత్రం ఈ నెల 12న ప్రేక్షకుల ముందుకురానుంది. గురువారం ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ప్రివ్యూలు చూసిన వారందరూ సినిమా బాగుందని ప్రశంసించారు, విడుదలకు ముందే పాస్ అయ్యామని దిల్ రాజు చెప్పారు. మధ్యతరగతి నేపథ్యంలో చక్కటి హాస్యభరిత చిత్రమిదని దర్శకుడు సందీప్‌రెడ్డి బండ్ల పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చిత్రబృందం మొత్తం పాల్గొంది.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.